# అభ్యుదయం
The Pride of Telugu national daily

RNI: TEL TEL /2019/12836





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ మంగళవారం 08- 9- 2026 సంపుటి : 6 సంచిక : 212 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- నిషేధిత భూములు 22ఏ జాబితాపై సభలో రగడ
- ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో బీజేపీ నినాదాలు
- 22ఏ అంశంపై చర్చకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలి
- 22ఏ జాబితాపై మంత్రి శ్రీధర్ బాబు వివరణ
- వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ ఇళ్లు పూర్తి

2లో





# స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు..!

- వ్యాఖ్యలతో అసెంబ్లీలో రాజకీయ దుమారం
- కంటతడి పెట్టుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్
- మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాల్సిందే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్

మిగతా 2లో

హైదరాబాద్, **అభ్యుదయం**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రాజకీయ దుమారం నెలకొంది. మరోవైపు మంత్రి సీతక్క భావోద్వేగానికి గురికాగా, స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతిపై అనుచిత భాషలో వ్యాఖ్యలు చేయడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక్క



వ్యక్తిని కించపరచడం కాదని అది మొత్తం

# అసెంబ్లీ వద్ద రచ్చ..



- సమావేశాల ప్రారంభానికి ముందు ఉద్రిక్తత
- హామీల అమలుపై బీఆర్ఎస్ నేతల నిరసన
- నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి నేతలు
- నినాదాలు, ప్లకార్డులతో మూకుమ్మడి నిరసన
- పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట
- అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్
- మరింతగా నెలకొన్న ఉద్రిక్త వాతావరణం
- పోలీసులతో వాగ్వాదంలో కేటీఆర్ కు గాయాలు
- ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డ బీఆర్ఎస్
- పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో కేటీఆర్ ఆగ్రహం
- తోపులాటలో గాయపడ్డ మహిళా ఎమ్మెల్యేలు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

హైదరాబాద్, **అభ్యుదయం** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా హరీశ్‌రావు

మిగతా 2లో

# కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,**అభ్యుదయం**

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

మిగతా 2లో



## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు



- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

హైదరాబాద్,సెప్టెంబర్1**అభ్యుదయం**

తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని



## అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

- మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు
- ఆ రెండు ముమ్మాటికీ ఫ్యాక్షన్ పార్టీలే..
- ప్రజలకు గోరంత, తమకు కొండంత
- విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

2లో



## హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులా?

మహిళా ఎమ్మెల్యేలు అని చూడకుండా దారుణం జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు: సబిత

# ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..



- సీఎం రేవంత్ సారీ చెప్పాలి
- రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్
- టీషర్టులతో మీరు పార్లమెంట్?కు వెళ్లారు
- మేము టీషర్టులతో అసెంబ్లీకి రాకూడదా?
- పోలీసుల అభ్యంతరంపై హరీశ్‌రావు
- ఇది ముమ్మాటికీ దుశ్శాసన సభ..
- మహిళా నేతల జుట్టు పట్టుకుని ఈడ్చేస్తారా?
- శాంతియుతంగా నిరసనపై ఉక్కుపాదమా!
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉంది

హైదరాబాద్, **అభ్యుదయం**

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన హరీశ్‌రావు, ప్రస్తుత శాసనసభ ప్రజాస్వామ్యబద్ధంగా నడవడం లేదని, అది కౌరవ సభను తలపిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలోనే ఈరోజు అత్యంత నల్లని రోజుగా మిగిలిపోతుందని, ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను దుర్మార్గంగా ప్రయోగిస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నినాదాలతో కూడిన టీషర్టులతో రావొద్దని బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల అభ్యంతరంతో మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టీ షర్టులు విప్పేశారు. బలియన్లపై ఉన్న హరీశ్‌రావు

- మిగతా 2లో పేజిలో

అభ్యుదయం
The Pride of Telugu national daily
మంగళవారం 08-9-2026

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## హక్కుల కోసం ప్రశ్నిస్తే
# తప్పుడు కేసులా?

హైదరాబాద్,సెప్టెంబర్1 అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై అభ్యంతరకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం తమకు జరిగిన పరాభవం కాదని, మొత్తం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన తీవ్ర అవమానమని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ 1,000 రోజుల విఫల పాలనను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి తరలివచ్చిన తమను పోలీసులు అమానుషంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చుకెళుతూ, చీరలు లాగుతూ విచక్షణారహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. "సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని పోలీసులు లాగుతుంటే, కేటీఆర్ సమయానికి వచ్చి అడ్డుకోకపోయి ఉంటే మమ్మల్ని అక్కడే పడేసి తొక్కేసేవారు.. కేటీఆర్ రావడంతోనే మేము ప్రాణాలతో బయటపడ్డాం" అని సబితా ఇంద్రారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే గొంతు నొక్కడం, బట్టలు లాగడం, దాడికి దిగడం ఏ రకమైన ప్రజాపాలన అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం...

నేడు ప్రజాప్రతినిధులైన మహిళలకే రక్షణ లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. హక్కుల కోసం ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

అమరావతి,సెప్టెంబర్7

"అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఏపీ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే నూతన రాజకీయ పార్టీ జెండా, అజెండాను ప్రకటించే ముందు, రాష్ట్రంలోని సమస్యలను ప్రజల ముందు ఉంచుతానని స్పష్టం చేశారు. ఏపీకి ఇప్పుడు మూడో ప్రత్యామ్నాయం ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తానని ఆయన తెలిపారు.

## ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్,సెప్టెంబర్7 తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే నిషేధిత భూములు 22ఏ జాబితా వ్యవహారంపై సభలో రగడ మొదలైంది. 22ఏ నిషేధిత భూముల నిబంధన కింద ప్రైవేట్ భూముల నమోదుపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభలో నినాదాలు చేశారు. ఈ వివాదంపై తక్షణమే విచారణ కమిటీని వేయాలని బీజేపీ సభ్యులు ప్రభుత్వాన్ని పట్టుబట్టారు. ఈ ఆందోళనపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పందించారు. 22ఏ అంశంపై సభలో స్వల్పకాలిక చర్చ చేపట్టేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణ సిద్ధంగా ఉందన్నారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఈ అంశానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, నిబంధనలకు అనుగుణంగా చర్చపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం సభను అడ్డుకోవడం సరికాదని, సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అయితే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి శ్రీధర్ బాబు సర్దిచెప్పినప్పటికీ బీజేపీ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గకుండా పోడియం వద్ద కాసేపు నినాదాలు చేశారు. విచారణకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటన చేసేవరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో తెలంగాణ అసెంబ్లీ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.

## స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు..!



(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు జరిగిన అవమానమన్నారు. ఇది తెలంగాణ చరిత్రలోనే చీకటి రోజుగా సీఎం అభివర్ణించారు. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన సభ్యుడితో తక్షణమే రాజీనామా చేయించాలని, అవసరమైతే అతని పార్టీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాల్సిందిగా కోరారు.

శాసనసభలో జరిగిన ఈ ఘటనపై సీఎం తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. "స్పీకర్ స్థానం రాజ్యాంగబద్ధమైన అత్యున్నత స్థానం.. సీఎం నుంచి సాధారణ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆ పదవిని గౌరవించాల్సిందే..

స్పీకర్ మనసు గాయపడేలా, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం క్షమించరాని నేరం" అని వ్యాఖ్యానించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సభాపతిని అవమానించిన అంశాన్ని తాను దళిత ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పారని, మూడెకరాల భూమి హామీని అమలు చేయలేదని రేవంత్ విమర్శించారు. తొలి ప్రభుత్వంలోనే దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారని, నేరెళ్ల ఘటనలో దళితులపై దాడులు జరిగాయని ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం సంయమనం పాటిస్తే బలహీనతగా భావించవద్దన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరింపులతో ప్రభావితం చేయాలనుకుంటే సహించబోమని స్పష్టం చేశారు. సభలో చర్చ అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఘటనపై కఠిన సభా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దుర్మార్గపు పోకడలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇలాంటివి కట్టడి చేయకపోతే సమాజం మనలను క్షమించదని, ఇలాంటి దుర్మార్గమైన తక్షణమే చర్యలు కట్టడి చేయాలన్నారు. ప్రతిపక్ష నేత పామ్ హౌస్‌లో ఉండి ప్రోత్సహిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.

స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరు మండలి సభ్యులు బూతులు మాట్లాడారన్నారు. తాతా మధు, నవీన్ మీద చర్యలు తీసుకోవాలని.. వీధుల్లో కొట్లాడినట్లు.. అసెంబ్లీ ముందు ప్రవర్తించారంటూ మండిపడ్డారు. అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారని.. కేసీఆర్ డైరెక్షన్‌లోనే ఈ వ్యవహారం జరిగిందని సీతక్క పేర్కొన్నారు. సభలో ప్రసంగిస్తూ మంత్రి సీతక్క భావోద్వేగానికి గురయ్యారు.. స్పీకర్ స్థానాన్ని అవమానించడం సరికాదన్నారు..

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు.

# ఇది శాసనసభ కాదు.. కౌరవసభ..

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద కేటీఆర్, హరీశ్‌రావును పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీసుల తీరుపై సునీతా లక్ష్మారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. పోలీసులు తన పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె కంటతడి పెట్టుకున్నారు. పోలీసుల వైఖరిని కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు తప్పుపట్టారు. ఈ సందర్భంగా హరీశ్?రావు మాట్లాడారు.

రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్టులు వేసుకుని పార్లమెంట్‌కు వెళ్లారని, తాము అలా అసెంబ్లీకి రాకూడదా అని ప్రశ్నించారు. నల్ల టీషర్టుపై హామీలు అమలు చేయాలని మాత్రమే ఉందని తెలిపారు. నిరసన తెలిపే హక్కు తమకు ఉందన్న ఆయన, తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి రాకూడదనే ఇలాంటివి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీకి వస్తే ప్రశ్నిస్తారనే అడ్డుకుంటున్నారని, ప్రధాన ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా, బీఆర్?ఎస్? నేతల ఆరోపణలపై ఖైరతాబాద్? డీసీపీ శిల్పవల్లి స్పందించారు. నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రావడం నేరం కాదని పేర్కొన్నారు. నల్ల టీషర్టులపై అభ్యంతరకర పదాలున్నాయని తెలిపారు. టీషర్ట్‌లపై ఉన్న పదాల కారణంగానే అసెంబ్లీ లోపలికి అనుమతించలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదన్న డీసీపీ, పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఆరోపణలనయి పరిశీలిస్తామన్నారు. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారన్న శిల్పవల్లి, అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటన వీడియోలను పరిశీలిస్తామన్నారు. ఆందోళన సందర్భంగా పోలీసులు ప్రవర్తించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హరీశ్‌రావు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల అత్యంత హేయంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీర లాగడం, సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కడం వంటి ఘటనలు అత్యంత అమానుషమని ధ్వజమెత్తారు. మహిళా సభ్యుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించిన అధికారులను సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టేది లేదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తోపులాటలో జగదీష్ రెడ్డిని కింద పడేసి తొక్కేందుకు యత్నించారని, కేటీఆర్, సంజయ్, యాదవరెడ్డి, రాజశేఖర రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు వైఫల్యాలు, పింఛన్లు, మూడేళ్లుగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్మెంట్, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల నుంచి తప్పించుకోవడానికే ఈ దాడులకు తెగబడ్డారని విమర్శించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల విఫల పాలన వాస్తవాలు సభలో బట్టబయలవుతాయనే భయంతోనే తమపై పథకం ప్రకారం కుట్ర పన్ని సస్పెండ్ చేశారని ఆరోపించారు

సభలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ లేకుండా చేసి, బీజేపీ -- కాంగ్రెస్ కలిసి నామమాత్రపు చర్చలతో మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం చేస్తున్నాయని హరీశ్‌రావు ఎండగట్టారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# అసెంబ్లీ వద్ద రచ్చ..



బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు. పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు. కొద్దిసేపు ఆయన స్పృహ కోల్పోయినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన తన కాలికి అయిన గాయాన్ని కూడా మీడియాకు చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నించేందుకు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చినట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన 22ఏ భూముల అంశాన్ని కూడా సభలో ప్రధానంగా ప్రస్తావించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. మరోవైపు అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు.

అభ్యుదయం
మంగళవారం 08-9-2026

# తిరుపతికి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్..!




అమరావతి,సెప్టెంబర్7 తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులకు, కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ప్రయాణించే వారికి భారతీయ రైల్వే శాఖ తీపి కబురు అందించింది. కర్ణాటకలోని శివమొగ్గ టౌన్ నుండి బెంగళూరు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతికి నూతన 'వందే భారత్ ఎక్స్‌ప్రెస్' రైలును ప్రారం భించాలని రైల్వే బోర్డు ప్రతిపాదించింది. ఓ ఎంపీ అభ్యర్థన మేరకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ ప్రతిపాదనతో ఏపీలో మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుంది. శివమొగ్గ పట్టణం, తిరుపతి మధ్య బెంగళూరు మీదుగా కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలన్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అభ్యర్థనకు రైల్వే బోర్డు సానుకూలంగా స్పందించింది. ఈ సర్వీసు కోసం అధికారిక ప్రతిపాదనను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం.తిరుపతి నుంచి రైలు అనుసంధానాన్ని విస్తరించి, మెరుగుపరచాలన్న ఎంపీ అభ్యర్థన మేరకు నైరుతి రైల్వే రూపొందించిన కార్యాచరణ ప్రణాళికలో ఈ ప్రతిపాదనను చేర్చారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నందుకు రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓకు గురుమూర్తి ధన్యవాదాలు తెలిపారు. అలాగే, మిగిలిన లాంఛనాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి, త్వరలోనే ఈ సేవను ప్రారంభించాలని అధికారులను కోరారు.ప్రతిపాదిత రైలు తిరుపతి, శివమొగ్గ, బెంగళూరు మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుందని, తద్వారా యాత్రికులకు, అలాగే విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, ఇతర ప్రయోజనాల కోసం ప్రయాణించే ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు. కర్ణాటకలోని శివమొగ్గ, బెంగళూరు పరిసర ప్రాంతాల నుండి తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా అవుతుంది.

అలాగే ఉన్నత విద్య, వైద్య సేవలు, ఉద్యోగాలు, వ్యాపార నిమిత్తం బెంగళూరు, తిరుపతి మధ్య ప్రయాణించే వారికి అత్యంత వేగవంతమైన, సుఖవంతమైన రవాణా సౌకర్యం లభిస్తుంది.

## ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

**శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్**

హైదరాబాద్,సెప్టెంబర్1 ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు.

## పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

**గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు**



న్యూఢిల్లీ,సెప్టెంబర్7 వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## ఏపీలోని పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన



అమరావతి,సెప్టెంబర్7 ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు కీలక జిల్లాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రాబోయే మూడు గంటల్లో వాతావరణం ఒక్కసారిగా మారనుందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని పలు ప్రాంతాలపై ప్రభావం అధికంగా ఉండనుందని విపత్తుల సంస్థ పేర్కొంది. ముఖ్యంగా గురజాల, మాచర్ల, దర్శి, కందుకూరు, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, చిలకలూరిపేటతో పాటు వాటి పరిసర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. వర్షంతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఎస్డీఎంఏ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద, ఇతర తాత్కాలిక షెడ్ల కింద నిలబడటం అత్యంత ప్రమాదకరమని స్పష్టం చేసింది. ప్రజలు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని కోరింది.

## కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలి.

ఏలూరు, సెప్టెంబరు 07 జిల్లాలో కుష్టు వ్యాధిని సమాజం నుండి తరిమేయ్యాలని, ప్రాథమిక దశలోనే గుర్తించి, అవసరమైన వైద్యసేవలు, వైద్యచికిత్సలు అందించేందుకు చేపడుతున్న ఇంటింటి సర్వేను జిల్లా ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు. జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, కుష్టునివారణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుండి 29వ తేదీ వరకు 14 రోజులు పాటు ఇంటింటి కుష్టువ్యాధి నిర్మూలన సర్వేగోడ పత్రికలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలోకుష్టువ్యాధి నిర్మూలన ఇంటింటి సర్వే ఇంటింటికీ వెళ్ళి నిర్వహించే సర్వేలో సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. చర్మంపై కనిపించే అనుమానాస్పద మచ్చలు, పొక్కులు,రంగు మార్పులు, స్పర్శతగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సర్వే సిబ్బందికి తెలియచెయ్యాలని సూచించారు. అనుమానిత కేసులను గుర్తించి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, చికిత్సలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు

## నిరుద్యోగులపై బురదజల్లుతారా?

**కష్టపడి మెగా డీఎస్సీ సాధించారు-ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఫైర్**

అమరావతి,సెప్టెంబర్7 మెగా డీఎస్సీలో ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల శ్రమను, వారి విజయాన్ని అవమానించేలా వైసీపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం అత్యంత బాధాకరమని ఏపీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మెగా డీఎస్సీ సాధించిన అభ్యర్థులను వేధించడం, వారిపై బురదజల్లడాన్ని వైసీపీ నేతలు వెంటనే మానుకోవాలని హితవు పలికారు. 2018 డీఎస్సీలో తృటిలో ఉద్యోగం కోల్పోయినప్పటికీ నిరాశ చెందకుండా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో, రాత్రింబవళ్లు తేడా లేకుండా చదివి ఎన్నో త్యాగాలు చేసి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని మంత్రి కొనియాడారు. వారి విజయాన్ని స్వార్థ రాజకీయాల కోసం అవమానించడం తగదని మండిపడ్డారు. అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ జాబితా విడుదల వరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేసిందని స్పష్టం చేశారు. మెరిట్, అర్హత ప్రాతిపదికన ఉద్యోగాలు సాధించిన వారి కష్టాన్ని ప్రశ్నించడం ఆయా అభ్యర్థుల కుటుంబాల త్యాగాలను అవమానించడమేనని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్తుతో రాజకీయ క్రీడలొద్దని, అభ్యర్థుల ఆవేదనను గ్రహించి జగన్ తక్షణమే తన వైఖరిని మార్చుకోవాలని అన్నారు.

## తాతా మధును బర్తరఫ్ చేయాలి

**స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు - కేసీఆర్ క్షమాపణ చెప్పాలి: ఏలేటి**



హైదరాబాద్,సెప్టెంబర్1: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్టుగా భావిస్తున్న వ్యాఖ్యలు శాసనసభ వేదికగా తీవ్ర దుమారాన్ని రాజేశాయి. సభలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ ఎమ్మెల్యేల తరఫున స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ తక్షణమే దీనిపై సభకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తాతా మధు కావాలని మాట్లాడారా లేక ఎవరైనా మాట్లాడించారా అని ప్రశ్నించిన ఏలేటి... ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన సదరు ఎమ్మెల్సీని పదవి నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని పట్టుబట్టారు. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా సభలో తీవ్రస్థాయిలో మండిపడుతూ, కేసీఆర్ క్షమాపణలు చెప్పాల్సిందేనని, మధుపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు జరిగిన తీవ్ర పరాభవంపై మంత్రి సీతక్క అసెంబ్లీలోనే భావోద్వేగానికి గురై కంటతడి పెట్టగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా తీవ్ర మనస్తాపంతో భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకోవడం సభను కుదిపివేసింది. మరోవైపు 22-ఏ నిషిద్ధ భూముల వివాదంపై ప్రభుత్వాన్ని మహేశ్వర్ రెడ్డి నిలదీశారు. 22-ఏ భూముల్లో జరిగిన అక్రమాలపై స్వయంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డే క్షమాపణలు చెప్పాలని, అధికారుల మీద నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ భూకుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని మంత్రి శ్రీధర్ బాబు సభలోనే స్పష్టమైన హామీ ఇస్తే తమ నిరసనను విరమిస్తామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం నేరుగా సమాధానం చెప్పకుండా ఇతర అంశాలతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని మండిపడ్డారు. 'ధరణి'పై నిజంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిగిందా అని నిలదీసిన ఆయన... ఒకవేళ జరిగితే ఆ ఆడిట్ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



న్యూఢిల్లీ,సెప్టెంబర్7 దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో అస్థిరత, వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. సెన్సెక్స్ 382.62 పాయింట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు సుమారు 0.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సాంకేతికంగా కీలక స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,800 స్థాయి గతంలో కీలక మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలదొక్కుకోకపోతే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు 23,750-23,700 స్థాయిని తక్షణ మద్దతుగా నిపుణులు చూస్తున్నారు. ఈ స్థాయి కంటే దిగువన నిఫ్టీ ముగిస్తే మరింత అమ్మకాలు జరిగి 23,600 ప్రాంతం వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం స్వల్పంగా పెరిగింది. రంగాల వారీగా ఐటీ, మెటల్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లు కూడా వెనుకబడ్డాయి. అయితే ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు మాత్రం మార్కెట్ ప్రతికూలతను తట్టుకొని మెరుగ్గా రాణించాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి పెట్టారు.

## ఏలూరు మేయర్, జడ్పీ ఛైర్మన్ పదవులు బీసీలకే కేటాయించాలి

ఏలూరు, సెప్టెంబర్ 7:ఏలూరు నగర మేయర్, జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులను బీసీలకు కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది.ఏలూరులోని లేడీస్ క్లబ్ మీటింగ్ హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి (గోపి) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలు, రాజకీయ ప్రాతినిధ్యంపై చర్చించారు.

అభ్యుదయం
The Pride of Telugu national daily
మంగళవారం 08-9-2026

## అంబేద్కర్‌ను అవమానించిన అమరా ప్రసాద్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలి

**సిద్దిపేటలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన**



సిద్దిపేట, సెప్టెంబర్ 7భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన అమరా ప్రసాద్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.
సిద్దిపేటలోని పూలే--అంబేద్కర్ సర్కిల్ వద్ద సోమవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జేఏసీ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరా ప్రసాద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని అవమానించే వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అమరా ప్రసాద్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు తెల్జీర్ శ్రీనివాస్ యాదవ్, కరికే శ్రీనివాస్, వనం రమేష్, గౌరవ అధ్యక్షుడు కంతుల ప్రకాష్, జనరల్ సెక్రెటరీ మాచవరం మహేందర్, దేవసాని దయానందు, దేవరాయ ఎలం, నిమ్మ అశోక్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లేష్, బొమ్మల ప్రవీణ్, తలారి ప్రవీణ్, ప్రభురాజ్, రాజేష్, బోదాస్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరూరి రమేష్‌పై అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ ధ్వజం.. 420 హామీల అమలుకు డిమాండ్**





ఐనవోలు, సెప్టెంబర్ 7
మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు ఆరూరి రమేష్‌పై కాంగ్రెస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గడ్డం రఘువంశీ గౌడ్ హెచ్చరిం చారు. ఆరూరి రమేష్ పేరుతో రాజకీయంగా ఎదిగిన కొందరు నేడు ఆయనపైనే ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రఘువంశీ గౌడ్ మాట్లాడుతూ.. గతంలో ఆరూరి రమేష్ సహకారంతో లబ్ధి పొందిన వారు, ఆయన అండతో రాజకీయంగా ఎదిగిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. ప్రస్తుతం ఎవరు ఏ విధంగా వ్యవహరిస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. అధికారం ఉందనే అహంకారంతో కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచు కోవాలని హితవు పలికారు.ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ప్రతి పనిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నా రని, రాబోయే కాలంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని రఘువంశీ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు ప్రజలకు ఎవరు అండగా నిలిచారు, ఎవరు ప్రజా సమస్యలను పట్టించుకు న్నారనే విషయం స్పష్టమవుతుందన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజలే అంతిమ తీర్పు ఇస్తారని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వారికి గుణపాఠం చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని హెచ్చరించారు.

420 హామీలపై వినతిపత్రం
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఐనవోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఆదేశాల మేరకు తక్కళ్లపెల్లి చందర్‌రావు ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా తక్కళ్లపెల్లి చందర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్న ప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలలో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు.ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మండల సర్పంచుల ఫోరమ్ కన్వీనర్ గడ్డం రఘువంశీ గౌడ్, సర్పంచ్ షేక్ ఉస్మాన్ అలీ, మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్, మాజీ దేవస్థాన చైర్మన్ మునిగాల సమ్మయ్య, సీనియర్ నాయకులు దుపెల్లి కొమ్మురయ్య, గుంపావాలి, అడ్డగూడి సతీష్, పుల్యాల రాజిరెడ్డి, మారుపట్ల నరేష్, కట్కూరి రాజు, పిడుగు రవీందర్, కోలా సంపత్, దేవేందర్‌రావు, తాటికాయల కుమార్, జన్ను రాజు, కొత్తూరి రాజు, కాటబోయిన అశోక్, దుపెల్లి రాజు, కొత్తూరి జాన్సన్, మందపురి రాజు, చందు, రాజకుమార్, కళ్యాణ్, అఖిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీ నడుపుతారా?

**ఇదేనా ప్రజాస్వామ్యం.. ఇదేనా ప్రజా పాలన? --- అరూరి రమేష్**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులు.. మహిళా ఎమ్మెల్యేలపై దాడులపై తీవ్ర ఆగ్రహం**

**కాంగ్రెస్ 6 గ్యారెంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి? వెయ్యి రోజుల పాలనలో హామీల అమలు ఎక్కడ? --- మాజీ ఎమ్మెల్యే**





వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 7 ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీని నడపాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందా? ఇదేనా ప్రజాస్వామ్యం.. ఇదేనా ప్రజా పాలన? అంటూ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద వందలాది మంది పోలీసులతో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లను అడ్డుకుని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకునే క్రమంలో పోలీసులు దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలకు స్వల్ప గాయాలయ్యాయని అరూరి రమేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వర్ధన్నపేట నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో పర్వతగిరి మండలంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అరూరి రమేష్ పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

తెలంగాణ చరిత్రలో ఈరోజు చీకటి దినం
తెలంగాణ చరిత్రలో ఈరోజు చీకటి దినమని అరూరి రమేష్ అన్నారు. తెలంగాణలో నిరసన తెలిపే హక్కు ఎమ్మెల్యేలకు లేదా? అని ప్రశ్నించారు. టీషర్టులు ధరించి రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు వెళ్తే లేని తప్పు.. తెలంగాణ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్తే ఎందుకు వచ్చిందని నిలదీశారు.
ప్రశ్నించిన ప్రజలపై కేసులు, నిరసన తెలిపిన ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులు.. ఇదేనా తెలంగాణలో నడుస్తున్న ఇందిరమ్మ పాలన.. ప్రజా పాలన? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. రేవంత్ ప్రభుత్వానికి తెలంగాణలో నూకలు చెల్లినయ్ అని వ్యాఖ్యానిం చారు. రేవంత్ పాలనకు చరమగీతం ఈరోజు నుంచే ప్రారంభమైందని అన్నారు.ప్రజల సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అరూరి రమేష్ మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధులపై దాడి చేయడం తెలంగాణ రాజకీయ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతుందని అన్నారు.
ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతును అణచివేయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహిళలను గౌరవిస్తామని చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళా ఎమ్మెల్యేలపై దాడి జరగడాన్ని ఎలా సమర్థిస్తుందని ప్రశ్నించారు.బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని, మహిళా ప్రజాప్రతి నిధుల గౌరవం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని అన్నారు.

కాంగ్రెస్ 6 గ్యారెంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పర్వతగిరి మండల ప్రజా పరిషత్ ప్రజావాణి సమావేశానికి బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు 6 గ్యారెంటీలు, 420 హామీలు, హామీ పత్రాలు, అఫిడవిట్‌ల ద్వారా ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిలో చాలా వరకు అమలు కాలేదని విమర్శించారు.గతంలో ఎకరానికి రూ.10 వేలుగా ఉన్న రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో స్పష్టంగా ప్రకటించారని గుర్తుచేశారు. రైతుబంధు కింద రూ.15 వేలు ఇవ్వడంతో పాటు కౌలు రైతులకు కూడా ఆర్థిక సాయం చేస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు.
రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చెప్పిన స్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. రైతుబీమా కింద రూ.5 లక్షల రక్షణ కల్పిస్తామని, రైతు కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పి రైతుబీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.
వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. పంటలకు పంట బీమా అమలు చేస్తామని హామీ ఇచ్చి, ప్రభుత్వం ఏర్పడి దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా పంట బీమాపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.పంట నష్టపోయిన రైతులకు గతంలో ఎకరానికి రూ.10 వేల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని గుర్తుచేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు.రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. ఆ హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలకు రూ.2,500.. తులం బంగారం ఏమైంది?
మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని అరూరి రమేష్ విమర్శించారు. మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు.కళ్యాణలక్ష్మి కింద రూ.1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి తులం బంగారం ఇవ్వలేదని విమర్శించారు. గత ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణలక్ష్మి పథకాన్నే నిర్వీర్యం చేసే పరిస్థితిని తీసుకొచ్చారని ఆరోపించారు.వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్ రోగులకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. గతంలో ఉన్న రూ.2 వేల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు.కొత్త పెన్షన్లు ఇస్తామని చెప్పినా కొత్త పెన్షన్ల మంజూరులో ప్రభుత్వం విఫలమైందన్నారు.

విద్యార్థులు, నిరుద్యోగుల హామీలు ఎక్కడ?
విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, స్కూటీల హామీలు ఏమయ్యాయని అరూరి రమేష్ ప్రశ్నించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్న ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు.

'వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే'
వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసులకు ఎవరూ భయపడొద్దని అరూరి రమేష్ అన్నారు. తమను ఇబ్బంది పెట్టిన వారికి సమాధానం చెబుతామని, బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ప్రజాస్వామ్య హక్కులను కాపాడే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమాల్లో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ గౌడ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు ఏకాంతం గౌడ్, యుగేందర్ రావు, చీమల బిక్షపతి, మాజీ ఎంపీటీసీ రాజు, మండల సర్పంచులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు.

ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ.

# రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు!

**పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం**




పాకిస్థాన్ క్రికెట్ సంక్షోభం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఆ దేశ ఆటగాళ్లపై ఏకంగా ఫిక్సింగ్ ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంతర్గత విచారణ కూడా చేపట్టినట్లు తెలుస్తోంది. మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ ఆఫ్ ఫీల్డ్ ప్రవర్తన అనుమానస్పదంగా ఉందనే వార్తలు కలకలం సృష్టించాయి. ఇంగ్లండ్ పర్యటనలో ఘోర పరాజయాలతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఈ ఘోర పరాజయాల నేపథ్యంలో పీసీబీ కూడా కఠిన చర్యలు తీసుకుంది. హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్‌తో పాటు ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. దాంతో పాకిస్థాన్ జట్టు అప్రతిష్టపాలై ఇంట బయట తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే ఇంగ్లండ్ గడ్డపై పాకిస్థాన్ ఘోర పరాజయాలకు క్రికెటర్ల వైఫల్యంతో పాటు... ఫిక్సింగ్ కూడా ఓ కారణమని మీడియాలో కథనాలు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యంగా వేటుకు గురైన ఏడుగురిలో రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్ మొబైల్ డేటాను పీసీబీ స్వాధీనం చేసుకొని విచారణ జరుపుతుందని పాక్‌కు చెందిన జియో న్యూస్ పేర్కొంది. ఈ కథనం ప్రకారం.. పీసీబీ అధికారులు.. కేవలం ఆటగాళ్ల ప్రవర్తననే కాకుండా.. వారు సంప్రదించిన వ్యక్తులను కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిక్సింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రావాల్సి ఉన్నప్పటికీ.. రిజ్వాన్, ఇమామ్ భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంగ్లండ్ పర్యటనకు రిజ్వాన్, ఇమామ్‌లను ఎంపిక చేయడంపై వివరణ కోరుతూ సెలెక్టర్లకు పీసీబీ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మూడో టెస్ట్ ఆడే ఆటగాళ్ల నుంచి పీసీబీ మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు పాకిస్థాన్ వార్తా సంస్థ 365 న్యూస్ పేర్కొంది. మ్యాచ్ ముగిసే వరకు ఆటగాళ్లకు మొబైల్స్ ఇచ్చేది లేదని స్పష్టం చేసినట్లు రాసుకొచ్చింది. బర్మింగ్‌హామ్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి మూడో టెస్ట్ ప్రారంభం కానుంది. ఫిక్సింగ్ ఆరోపణల నేపథ్యం పాక్ బోర్డు విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణపరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి అమీర్ మీర్ వెల్లడించాడు. 'ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం.

# సౌత్‌జోన్ కొంపముంచిన సిరాజ్..



ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని సౌత్ జోన్‌తో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(334 బంతుల్లో 30 ఫోర్లు, 7 సిక్స్‌లతో 270)తో డబుల్ సెంచరీతో సత్తా చాటగా.. కుమార్ కుశాగ్ర(132 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 101) సెంచరీతో చెలరేగాడు. శిఖర్ మోహన్(120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 85), అభిమన్యు ఈశ్వరన్(86 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 72) హాఫ్ సెంచరీలతో రాణించారు. వైభవ్



సూర్యవంశీ(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 44) దూకుడుగా ఆడాడు. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్(4/180) నాలుగు వికెట్లు తీయగా.. చామ మిలింద్, శ్రేయస్ గోపాల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. షేక్ రషీద్‌కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ తీవ్రంగా నిరాశపర్చాడు. 25 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీయకపోగా.. 5.60 ఎకానమీతో 140 పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం ఈస్ట్ జోన్‌కు కలిసొచ్చింది. దూకుడుగా ఆడిన ఆ జట్టు రెండు రోజుల పాటు పూర్తిగా బ్యాటింగ్ చేసి రికార్డ్ స్కోర్ అందుకుంది. దులీప్‌ట్రోఫీ ఫైనల్స్ చరిత్రలోనే ఇది రెండో అత్యధిక స్కోర్‌గా నిలిచింది. 1987 దులీప్ ట్రోఫీ ఫైనల్లో వెస్ట్ జోన్‌పై నార్త్ జోన్ 868 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక స్కోర్‌గా కొనసాగుతోంది. తాజా ఫైనల్‌కు ముందు రెండు సార్లు మాత్రమే జట్లు 700 ప్లస్ స్కోర్లు చేశాయి. 1986లో సౌత్ జోన్.. 1991లో నార్త్ జోన్ 700 పరుగుల మార్క్‌ను అందుకున్నాయి. హాఫ్ సెంచరీకి చేరువైన అనుకూల్ రాయ్(45)ను షేక్ రషీద్ ఔట్ చేయగా.. షమీ, ఖురైషి సౌత్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. శ్రేయాస్ గోపాల్ ఈ జోడీని విడదీసాడు. ఖరేషి(40)ని క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ దూకుడుగా ఆడి జట్టు స్కోర్ 700 ధాటించాడు. అతనితో పాటు ముఖేష్ కుమార్(0)ను విజయ్ పెవిలియన్ చేర్చి ఈస్ట్ జోన్ భారీ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో రెండో రోజు ఆట ముగిసింది. ....

# భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది





మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది.గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌ఛల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిసిందే.

ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు.

అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

## సంపాదకీయం

# మ్యాట్రీమోనీ పేరుతో భారీ మోసాలు




పెళ్లి కుదరాలి.. పిల్లల జీవితం బాగుండాలి.. అనే తల్లిదండ్రుల ఆశ పడుతుంటారు. తమ స్థాయికి మించి కూడా మంచి సంబంధాల కోసం వెతుకుతుంటారు. బంధువులు తెలిసిన వారితో పాటు ఇటీవల కాలంలో మ్యాట్రీమోనీలను కూడా ఆశ్రయిస్తున్నారు. అయితే తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే నల్గొండ జిల్లాలో వెలుగు చూసింది. మీ అమ్మాయికి పెళ్లి సంబంధం చూస్తున్నారా? పెళ్లి కుదిరిందానండీ.. మాది పలానా మ్యాట్రీమోనీ.. మీ అమ్మాయికి తగిన సంబంధాలు మావద్ద ఉన్నాయి. అబ్బాయి ప్రొఫైల్ పెట్టామంటారా.. అంటూ కేటుగాళ్లు ఫోన్ లో అడుగుతారు. తల్లిదండ్రులు ఆసక్తి చూపగానే వెంటనే వాట్సాప్‌లో ఓ అందమైన అబ్బాయి ఫొటో.. దాంతోపాటు ఆకట్టుకునే ప్రొఫైల్ పంపిస్తారు. ఎన్ఆర్ఐ.. డాక్టర్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భారీ జీతం.. కోట్ల విలువైన ఆస్తులు అంటూ ప్రొఫైల్‌ను నమ్మేలా చేస్తారు. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. మీ పేరు రిజిస్టర్ చేయాలంటే రూ.5 వేలు పంపండి. అబ్బాయి తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఇస్తాం. మరికొన్ని మంచి ప్రొఫైల్స్ కూడా పంపిస్తాం అంటూ నమ్మిస్తారు. పెళ్లి సంబంధం కుదిరే ఆశతో తల్లిదండ్రులు డబ్బులు పంపిస్తారు. డబ్బులు అందిన కొద్దిసేపటికే అబ్బాయి తల్లిదండ్రుల పేరుతో ఓ ఫోన్ నంబర్ ఇస్తారు. కానీ ఆ నంబర్‌కు కాల్ చేస్తే.. "ఈ నంబర్ ప్రస్తుతం పనిచేయడం లేదు" అనే సమాధానం వస్తోంది. మ్యాట్రిమోనీకి ఫోన్ చేస్తే.. స్విచ్ఛాఫ్ వస్తుంది. వాట్సాప్‌లో పంపిన ప్రొఫైల్ లేదు.. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి లేడు.. డబ్బులు మాత్రం తిరిగి రాక తల్లిదండ్రులు సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారు. వీటితోపాటు మరో తరహాలోనూ ఈ మోసాలు జరుగుతున్నాయి. ముందుగా పేరున్న మ్యాట్రిమోనీ సంస్థల్లో కొంత మొత్తాన్ని చెల్లించి.. అక్కడి ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తారు. పక్కా వ్యూహంతో వారికి నచ్చిన ప్రొఫైల్స్ పట్టుకుని వేటకు బయలు దేరుతారు. ఎక్కువ కాలంగా సంబంధం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు.. వయసు దాటిపోతున్న యువతీ యువకులు.. రెండో పెళ్లి కోసం చూస్తున్నవారు.. ఇలా ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుంటారు. ఆ తర్వాత తామే మ్యాట్రిమోనీ నిర్వాహకులమని పరిచయం చేసుకుని.. మీకు మంచి సంబంధం కుదురుస్తాం అంటూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అడ్వాన్స్ తీసుకుంటారు. డబ్బులు చేతికి వచ్చాక ఫోన్ ఎత్తరు. ఒకవేళ ఎత్తినా.. సంబంధం మాట్లాడుతున్నాం.. కొంత సమయం పడుతుంది అంటూ కాలయాపన చేస్తారు. చివరకు పూర్తిగా అందుబాటులో లేకుండా పోతారు. మ్యాట్రిమోనీ సంస్థల పేరుతో మోసగాళ్లు పక్కా వ్యూహంతో బాధితులను మోసం చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు.. రూ.10 వేలు మాత్రమే తీసుకుంటారు. బాధితులు కూడా "ఇంత చిన్న మొత్తానికి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇలాంటి వాళ్లు పదుల సంఖ్యలో.. వందల సంఖ్యలో కుటుంబాలను టార్గెట్ చేస్తే.. అదే పెద్ద మొత్తంగా మారుతుంది. ఈ తరహా మ్యాట్రిమోనీ కాల్స్ ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. చిన్న మొత్తాల్లోనే మోసం చేస్తుండటంతో చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అందుకే బయటకు కనిపించే కేసుల కంటే.. వాస్తవంగా మోసపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.మ్యాట్రిమోనీ పేరుతో ఫోన్ వస్తే వెంటనే నమ్మొద్దని పోలీసులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. సంస్థ పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ, కార్యాలయ చిరునామా, సంప్రదింపు వివరాలు పరిశీలించాలనీ సూచిస్తున్నారు గుర్తింపు లేని వ్యక్తిగత నంబర్లకు డబ్బులు పంపకూడదనీ, అబ్బాయి, కుటుంబ సభ్యుల వివరాలను స్వతంత్రంగా తెలుసుకోవాలని, నిపుణులు చెబుతున్నారు తొందరపెట్టి డబ్బులు అడిగితే అప్రమత్తం కావాలనీ, మోసం జరిగితే చెల్లింపు వివరాలు, ఫోన్ నంబర్లు, వాట్సాప్ చాట్స్, ప్రొఫైల్ ఫొటోలు భద్రపరచాలనీ సూచిస్తున్నారు.

# కొత్త అర్హులకూ అవకాశం

## సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ

## స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి, సెప్టెంబర్ 7 : రాష్ట్రంలో ప్రతి నెలా జరిగే 'పేదల పండుగ'ను ప్రభుత్వం మరో స్థాయికి తీసుకువెళ్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించ నున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు.

అర్హులైన వారు తమకు సంబంధించిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అర్హతను పరిశీలిస్తారు. అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేస్తారు. అర్హులు దరఖాస్తును పూర్తి చేసి, అవసరమైన ధృవపత్రాలతో సంబంధిత స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రంలో సమర్పించాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ అందజేస్తారు.

**అవసరమైన ధృవపత్రాలు**






అన్ని కేటగిరీలకు సాధారణంగా ఆధార్ కార్డు, రైస్ కార్డు లేదా ఆదాయ ధృవపత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ప్రత్యేక ధృవపత్రాలను సమర్పించాలి. వృద్ధాప్య పింఛన్ కొరకు వయస్సు నిర్ధారణకు ఆధార్, వితంతు పింఛన్ కొరకు భర్త మరణ ధృవపత్రం, భర్త ఆధార్ నంబర్ ఉండాలి. ఒంటరి మహిళ కొరకు వివాహిత అయితే కోర్టు/అదాలత్ విడాకుల డిక్రీ; అవివాహిత అయితే తహసీల్దార్ జారీ చేసే వివాహం కాని ధృవపత్రం, దివ్యాంగుల పింఛన్ కొరకు 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వాన్ని నిర్ధారించే సదరమ్ ధృవపత్రం సమర్పించాలి. చేనేత కార్మికుల కొరకు చేనేత, జౌళి శాఖ ధృవపత్రం, మత్స్యకారుల కొరకు మత్స్య శాఖ ధృవపత్రం, డప్పు కళాకారుల కొరకు సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసే ధృవపత్రం ఉండాలి. సంప్రదాయ చెప్పుల తయారీదారులు కొరకు సాంఘిక సంక్షేమ శాఖ జారీ చేసే ధృవపత్రం, కల్లుగీత కార్మికుల కొరకు నిషేధ, ఎక్సైజ్ శాఖ ధృవపత్రం, ట్రాన్స్‌జెండర్ లబ్ధిదారులకు జిల్లా వైద్య మండలి జారీ చేసే ధృవపత్రం తప్పనిసరి.

**దేశంలోనే అత్యున్నత సామాజిక భద్రత**

ప‌స్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పింఛన్లు అందిస్తున్నారు. రాష్ట్ర జనాభాలో సుమారు 12.88 శాతం మంది సామాజిక భద్రత పింఛన్ల ప్రయోజనం పొందుతున్నారు. పింఛన్ మొత్తం, పింఛనుదారుల సంఖ్య, నెలవారీ వ్యయం, పింఛన్ల కోసం కేటాయిస్తున్న వార్షిక నిధుల పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యున్నత స్థానంలో ఉంది. ఇది కేవలం గణాంకాల్లో కనిపించే రికార్డు మాత్రమే కాదు... కోట్లాది పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నిరంతర ఆర్థిక భరోసాకు నిదర్శనం.

# నా వ్యాఖ్యలు స్పీకర్ ను ఉద్దేశించి చేసినవి కావు

### శాసనసభ ఘటనపై తాతా మధు వివరణ

హైదరాబాద్,సెప్టెంబర్1 తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం (సెప్టెంబర్ 07) చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి తాను మాట్లాడిన మాటలను తనకు ఆపాదిస్తున్నారని పేర్కొంటూ.. ఈ విషయంపై తన వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో మహిళా శాసనసభ్యులతో పాటు తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో తోపులాట, ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఎమ్మెల్సీ తాతా మధు చెప్పారు. ఈ క్రమంలో తనపై కూడా దాడి జరిగిందని, తన షర్టు, ఫ్యాంటు లాగేందుకు, గొంతు నొక్కేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని పేర్కొన్నారు. కొంతమంది తనను దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తీవ్ర ఆవేదనకు గురై.. తనపై దాడి చేసింది ఎవరు? తన షర్టు లాగేందుకు ఎవరు ప్రయత్నించారు? అలా చేయమని ఎవరు ఆదేశించారు? అంటూ తాను ప్రశ్నించినట్లు తాతా మధు వివరించారు. అయితే ఈ వ్యాఖ్యలను స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవిగా భావించడం సరికాదని స్పష్టం చేశారు.స్పీకర్ వ్యవస్థ పట్ల, వ్యక్తిగతంగా స్పీకర్ పట్ల తనకు ఎంతో గౌరవం ఉందని తాతా మధు తెలిపారు. స్పీకర్‌ను ఉద్దేశించి తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. ఒకవేళ తన వ్యాఖ్యల్లో ఏదైనా స్పీకర్‌ను ఉద్దేశించి నట్లు భావిస్తే.. ఆ మాటలను ఉపసంహరించు కుంటున్నానని, అందుకు విచారం వ్యక్తం చేస్తున్నానని పేర్కొన్నారు. శాసనసభలోకి వెళ్లే సమయంలో తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యంగా మహిళా శాసనసభ్యులతో పోలీసులు వ్యవహరించిన తీరుపై తాతా మధు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా శాసనసభ్యులతో తోపులాట జరిగిందని, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా తమ సీనియర్ నాయకులను పోలీసులు అక్కడి నుంచి తీసుకెళ్లారని ఆయన తెలిపారు. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో వ్యవహరించే విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శాసనసభ్యులపై జరిగినట్లు పేర్కొన్న పరిణామాలపై ప్రభుత్వం



స్పందించాలని తాతా మధు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను మాట్లాడిన వ్యాఖ్యలపై ఏర్పడిన వివాదం కంటే.. శాసనసభలో చోటుచేసుకున్న అసలు పరిణామాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తాతా మధు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల పట్ల జరిగిన ఘటనలపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభలో చోటుచేసుకున్న పరిణామాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. తాతా మధు ఇచ్చిన తాజా వివరణ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# వృద్ధ మహిళపై సీఐ దురుసు ప్రవర్తన

అమరావతి,సెప్టెంబర్7 బాపట్ల జిల్లా చీరాల టూటౌన్ సీఐ శశికుమార్ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ ఓ ఇంటి బయట వృద్ధురాలితో అసభ్యంగా ప్రవర్తించడం, దూషించడంపై సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. సీసీ కెమెరాలో నమోదైన ఈ దశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తున్నాయి. చట్టప్రకారం, నైతికంగా ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదంటూ ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు.బాపట్ల జిల్లా చీరాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో తాజాగా చోటుచేసుకున్న ఘటన పోలీసు శాఖ ప్రతిష్టపై మరోసారి చర్చకు దారితీసింది. ఎస్టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన ఓ వృద్ధ మహిళతో రెండో పట్టణ సీఐ శశికుమార్ వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సెప్టెంబర్ 6వ తేదిన ఆదివారం కార్డన్ సెర్చ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వైరల్‌గా మారిన వీడియోలో సీఐ శశికుమార్ వృద్ధ మహిళతో దురుసుగా మాట్లాడుతున్న దృశ్యాలు, అభ్యంతరకరమైన పదజాలంతో సంభాషిస్తున్నట్లు కనిపించే, వినిపించే దృశ్యాలు పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజలలో మరింత అపనమ్మకాన్ని కలిగించేలా ఉన్నాయి. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం పేరుతో కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయంగా ఉంటోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి ఒక వృద్ధ మహిళతో దురుసుగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. పోలీస్‌శాఖ శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ లు నిర్వహించే హక్కు ఉన్నప్పటికీ, ఆ సమయంలో పౌరుల, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే అధికారం ఏ చట్టం ఇవ్వలేదు. పోలీసు నియమావళి ప్రకారం ప్రజలతో, ముఖ్యంగా బలహీన వర్గాలు, వృద్ధులతో సంయమనంతో, గౌరవప్రదంగా వ్యవహరించాలి. డ్యూటీలో ఉండి కూడా దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించిన అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇలాంటి ఘటనలపై బాపట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ లేదా ఇతర ఉన్నతాధికారులకు సాక్ష్యాలతో కూడిన వీడియో, లేదా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసి న్యాయం కోరవచ్చు. పోలీసులు బూతులు తిట్టడం లేదా అసభ్య పదజాలం ఉపయోగించడం చట్టప్రకారం, నైతికంగా ఏమాత్రం సరైనది కాదు.

## ఐడీబీఐ బ్యాంక్ వాటాల విక్రయంలో పారదర్శకత లేదు..

న్యూఢిల్లీ: ఐడీబీఐ బ్యాంక్ ఈక్విటీలో ప్రభుత్వ, ఎల్ఐసీ వాటాల అమ్మకంలో పెద్ద గూడుపుఠానీ జరుగుతోందని అఖిల భారత బ్యాంకింగ్ అధికారుల సంఘం (ఏఐబీఓఏ) ఆరోపించింది. వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో ఎలాంటి పారదర్శకత లేకుండా కారు చౌకగా కెనడా కేంద్రంగా పనిచేసే ప్రేమ్‌వత్స నాయకత్వంలోని ఫెయిర్‌ఫాక్స్ హోల్డింగ్ కంపెనీకి కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొంది. దీనిపై ఏఐబీఓఏ ప్రధాన కార్యదర్శి ఎస్ నాగరాజన్.. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపమ్) కార్యదర్శికి ఒక లేఖ రాశారు. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని సరిదిద్దాలని కోరారు. ఈ ఏడాది జనవరి-ఫిబ్రవరిలో రూ.110 కనీస ధరగా నిర్ణయించిన ఐడీబీఐ బ్యాంక్ షేర్ల ధరను ఇప్పుడు రూ.81కు కుదించడంలో మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు.స్థిరాస్తులే రూ.30,000 కోట్లు: బ్యాంకు స్థిరాస్తులే రూ.30,000 కోట్ల వరకు ఉంటే, బ్యాంకు ఈక్విటీలో ప్రభుత్వం, ఎల్ఐసీలకు ఉన్న వాటాల్లో 60.72 శాతాన్ని ఒక్కో షేరును రూ.81 చొప్పున రూ.53,000 కోట్లకు అమ్మడం ఏమిటని నాగరాజన్ ప్రశ్నించారు. అసలు ఏ ప్రాతిపదికన ఐడీబీఐ బ్యాంక్ ఆస్తుల విలువ లెక్కగట్టారో బహిర్గతం చేయాలని కోరారు. ఈ విషయంలో వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే ఐడీబీఐ బ్యాంక్ మైనారిటీ వాటాదారుల ప్రయోజనాలకూ విఘాతం ఏర్పడుతుందని హెచ్చరించారు.

హైదరాబాద్‌లోని భూమి విలువే రూ.13,450 కోట్లు

ఐడీబీఐ బ్యాంక్‌కు హైదరాబాద్‌లో ఉన్న 50 ఎకరాల భూమి విలువే రూ.13,450 కోట్ల వరకు ఉంటుందని నాగరాజన్ తన లేఖలో పేర్కొన్నారు. 2019 జనవరిలో ఎల్ఐసీ ఈ బ్యాంకు ఈక్విటీలో ఒక్కో షేరును రూ.61 చొప్పున కొనుగోలు చేసింది. ఈ లెక్కన చూసి నా ఇప్పుడు ఐడీబీఐ బ్యాంక్ వాటాలను ప్రభుత్వం ఒక్కోటి రూ.133 చొప్పున అమ్మితే తప్ప ఎల్ఐసీకి గిట్టుబాటు కాదన్నారు. శుక్రవారం బీఎ?సఈలో ఐడీబీఐ బ్యాంక్ షేరు రూ.90.62 దగ్గర క్లోజైంది.

## వడ్డీ లేని ఈఎంఐలు. ఆదమరిస్తే ఇక అంతే..




పండగల సీజన్ మొదలైంది. తమ ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకునేందుకు కంపెనీలు, వ్యాపారులు రకరకాల ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. అందులో వడ్డీ లేని ఈఎంఐల ఆఫర్ ఒకటి. చాలా మంది గుడ్డిగా ఈ వడ్డీ రహిత ఈఎంఐ ఆఫర్లు నిజమని నమ్మి అవసరం ఉన్నా, లేకున్నా వస్తువులు కొనేస్తుంటారు. జాగ్రత్తగా పరిశీలిస్తే నిజానికి ఇవేమీ వడ్డీ రహిత ఈఎంఐలు కాదు. ప్రాసెసింగ్ ఫీజులు, ఈఎంఐ (నెలవారీ వాయిదా) లేటుగా చెల్లిస్తే భారీ పెనాల్టీలు ఉంటాయి. దీనికి తోడు ఈఎంఐలు చెల్లించడంలో ఏ మాత్రం ఆలస్యమైనా ఆయా వ్యక్తుల క్రెడిట్ స్కోరు కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఏదైనా వస్తువును వడ్డీ రహిత ఈఎంఐతో కొనే ముందు ఈ కింది విషయాల గురించి పూర్తిగా తెలుసుకోవాలి.ఏదైనా వస్తువును వడ్డీరహిత ఈఎంఐతో కొనే ముందు ఆ వస్తువు అసలు ధర ఎంతో తెలుసుకోవాలి. వడ్డీరహిత ఈఎంఐతో ఈ వస్తువు కొనుక్కోండి బాగుంటుంది అని కంపెనీలు, డీలర్లు సహజంగానే ఊదరగొడతారు. అయితే ఈ ఆఫర్ కింద కంపెనీలు, డీలర్లు ప్రాసెసింగ్ ఫీజు, కన్వీనియన్స్ చార్జీలు, పన్నులు, ఇతర ఖర్చుల పేరుతో బాగానే గుంజుతారు.ఉదాహరణకు రూ.30,000 విలువైన ఒక వస్తువుని మీరు మూడు మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లించేలా వడ్డీ రహిత ఈఎంఐతో కొంటున్నారనుకుందాం. అప్పుడు ఒక్కో విడత రూ.10,000 చొప్పున చెల్లిస్తే సరిపోతుందని అందరూ అనుకుంటారు. కానీ ఇది నిజం కాదు. కంపెనీలు అప్‌ఫ్రంట్ ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఖర్చుల పేరుతో బాగానే మన దగ్గర నుంచి వసూలు చేస్తాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వస్తువుని కొనే ముందే.. ఒకేసారి చెల్లించి కొంటే ఎంత అవుతుంది? వడ్డీ రహిత ఈఎంఐలతో కొంటే ఎంత అవుతుంది? అనే విషయం పూర్తిగా తెలుసుకోవాలి.ఎన్‌బీఎ?ఫసీలు, బ్యాంకులే ఈ తరహా వడ్డీరహిత ఈఎంఐ రుణాలు ఇస్తుంటాయి. ఇవి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నియంత్రణలోని సంస్థలా? కాదా? అనే విషయాన్ని వినియోగదారులు ముందే తెలుసుకోవాలి. అలాగే వీరి కస్టమర్ సపోర్ట్, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ విశ్వసనీయత గురించీ తెలుసుకోవాలి.

## పేగు, మలాశయ క్యాన్సర్‌ను అడ్డుకునే ఆహారాలు ఇవే.. అధ్యయనాల్లో వెల్లడి..



పేగు, మలాశయానికి వచ్చే క్యాన్సర్‌ను పూర్తిగా నివారించే మార్గం ఏదీ లేదని నిపుణులు చెబుతున్నారు. అయితే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కొలొరెక్టల్ క్యాన్సర్ ముప్పును కొంతవరకు తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా కాల్షియం, ఫైబర్, పాలీఫినాల్స్ వంటి పోషకాలు ఉండే ఆహారాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పెరుగు లేదా ఇతర కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం ద్వారా కొలొరెక్టల్ క్యాన్సర్ ముప్పు తగ్గే అవకాశం ఉంటుందని కొన్ని విస్తృత అధ్యయనాలు సూచిస్తున్నాయి. పెరుగులో కాల్షియంతోపాటు జీవించే ప్రోబయోటిక్ బ్యాక్టీరియా కూడా ఉంటాయి. ఇవి పేగు ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెబుతున్నారు. పేగులోని మంచి బ్యాక్టీరియాకు ఉపయోగపడే ఆహారాలను తీసుకోవడం కూడా ముఖ్యమే. ముఖ్యంగా బెర్రీ పండ్లలో ఫైబర్‌తోపాటు పాలీఫినాల్స్ ఉంటాయి. ఈ పోషకాలు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.

ఫైబర్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రతి భోజనంలోనూ ఫైబర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అవకాడో, విత్తనాలు, గింజలు, బీన్స్, ఓట్‌మీల్ వంటి ఆహారాల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. అధిక ఫైబర్‌ను తీసుకోవడం వల్ల పెద్ద పేగు క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉంటుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. కాఫీలో పాలీఫినాల్స్, ఇతర బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఎక్కువగా కాఫీ తీసుకునే వారిలో కొలొరెక్టల్ క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉండే అవకాశం కనిపించింది. అయితే కాఫీని మితంగా తీసుకోవడం, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవడం ముఖ్యం.

రోజువారీ ఆహారంలో పెరుగు, ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, గింజలు, విత్తనాలు, బీన్స్, ఓట్స్ వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను చేర్చుకోవడం మొత్తం ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి క్యాన్సర్‌ను పూర్తిగా అడ్డుకుంటాయని చెప్పలేం కానీ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో భాగంగా తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## సాయంత్రం భోజనం చేశాక తీపి తినాలనిపిస్తుందా..

### అయితే అలా ఎందుకు జరుగుతుంది..?



సాయంత్రం భోజనం చేసిన తర్వాత తీపి తినాలనే కోరిక చాలా మందిలో కనిపిస్తుంది. ఇలా స్వీట్ కోసం పదేపదే అనిపిస్తే శరీరంలో ఏదైనా పోషక లోపం ఉందని భావించడం సహజం. అయితే ప్రతి ఆహార కోరిక వెనుక ఒక నిర్దిష్ట విటమిన్ లేదా మినరల్ లోపమే కారణం అని చెప్పడం సరైనది కాదు. మనం రోజంతా ఎలా తిన్నాం, ఎంత నిద్రపోయాం, ఒత్తిడి ఎలా ఉంది, మన ఆహారపు అలవాట్లు ఎలా ఉన్నాయి వంటి అనేక అంశాలు ఈ కోరికలపై ప్రభావం చూపుతాయి. సోషల్ మీడియాలో ప్రతి ఆహార కోరికను శరీరం పంపే సంకేతంగా, దానికి కారణాన్ని ఒక పోషక లోపంగా చెప్పే విషయాలు తరచూ కనిపిస్తుంటాయి. ఉదాహరణకు చాక్లెట్ తినాలనిపిస్తే మెగ్నీషియం లోపం, ఐస్ తినాలనిపిస్తే ఐరన్ లోపం, ఉప్పగా తినాలనిపిస్తే అడ్రినల్ ఫెటీగ్ అంటూ వివిధ కారణాలు చెబుతుంటారు. కానీ మన శరీరం ఇంత సులభమైన పద్ధతిలో పనిచేయదు.

పోషకాహార లోపమా..?సాయంత్రం వేళల్లో తీపి తినాలనే కోరికకు చాలా సందర్భాల్లో ఒకే ఒక్క పోషక లోపం కారణం కాదు. రోజంతా తగినంత ఆహారం తీసుకోకపోవడం కూడా ఇందుకు కారణమవుతుంది. ఉదయం అల్పాహారం తొందరగా ముగించడం లేదా పూర్తిగా మానేయడం, మధ్యాహ్నం ఆరోగ్యంగా తినాలనే ఉద్దేశంతో చాలా తక్కువగా భోజనం చేయడం, సాయంత్రం ఆకలిని కాఫీతో అణచుకోవడం వంటి అలవాట్లు ఉంటే రాత్రి భోజనం సమయానికి శరీరం రోజంతా ఎదురైన ఆహార లోటును భర్తీ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఈ సమయంలో తీపి తినాలనే కోరిక మరింత పెరుగుతుంది. అలాగే ఆహారపు అలవాట్లు కూడా తీపి కోరికకు కారణమవుతాయి. చిన్నప్పటి నుంచి భోజనం తర్వాత బెల్లం ముక్క, టీతో బిస్కెట్ లేదా భోజనం తర్వాత కీర్ వంటి తీపి పదార్థాలు తినే అలవాటు ఉంటే, క్రమంగా మెదడు ఆ రివార్డ్‌ను ఆశించడం ప్రారంభిస్తుంది. దీంతో తీపి తినకుండా భోజనం పూర్తయినట్లు అనిపించదు. ఇది తప్పనిసరిగా పోషక లోపానికి సంకేతం కాదు.

మానసికంగా అలసిపోతే..రక్తంలో చక్కెర స్థాయిలు కూడా కొంతవరకు ప్రభావం చూపిస్తాయి. భారతీయ భోజనాల్లో అన్నం, చపాతీలు, పప్పులు వంటి కార్బోహైడ్రేట్లు ప్రధానంగా ఉంటాయి. వీటిలో తప్పేమీ లేదు. అయితే భోజనంలో తగినంత ప్రోటీన్, ఫైబర్ లేకపోతే ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉండదు. ఫలితంగా భోజనం చేసిన కొద్దిసేపటికే మరోసారి ఏదైనా తినాలనే కోరిక వస్తుంది. ఒత్తిడి కూడా ఈ విషయంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. మానసికంగా అలసిపోయిన రోజు తర్వాత మెదడు త్వరగా ఆనందాన్ని, ఉపశమనాన్ని కలిగించే ఆహారాల వైపు మొగ్గుచూపుతుంది.

## బరువు తగ్గాలని చెప్పి అన్నం పూర్తిగా మానేస్తున్నారా..



బరువు తగ్గాలని ప్రయత్నించేవారు ముందుగా అన్నం, రాజ్మా-చావల్ వంటి ఇంటి వంటకాలను తమ ఆహారం నుంచి తొలగించాలని అనుకుంటారు. అయితే బరువు తగ్గడంలో అసలు కీలకమైన విషయం ఏం తింటున్నామన్నదే కాకుండా, ఒక ప్లేట్‌లో ఏ ఆహారాన్ని ఎంత మోతాదులో తీసుకుంటున్నామన్నదే. సరైన పరిమాణంలో ప్రోటీన్, కూరగాయలు, పీచు పదార్థాలు ఉండేలా ప్లేట్‌ను సమతుల్యంగా మార్చుకుంటే, ఇష్టమైన ఇంటి భోజనాన్ని కొనసాగిస్తూనే బరువు తగ్గే ప్రయత్నం చేయవచ్చు. అన్నం ఎక్కువగా, కూరగాయలు లేదా ఇతర పోషక పదార్థాలు తక్కువగా ఉండే భోజనం త్వరగా ఎక్కువ కేలరీలను అందిస్తుంది. అలాగే కడుపు నిండిన అనుభూతి ఎక్కువసేపు ఉండదు. దీనికి బదులుగా అన్నం పరిమాణాన్ని తగ్గించి, ప్రోటీన్, కూరగాయలు, సలాడ్, పెరుగు వంటి వాటిని పెంచడం ద్వారా అదే భోజనాన్ని మరింత సంతృప్తికరంగా మార్చుకోవచ్చు నిపుణులు చెబుతున్నారు.

అన్నం పరిమాణాన్ని తగ్గించాలి..

ఉదాహరణకు, బరువు పెరగడానికి దారితీసే ప్లేట్‌లో 2 కప్పులు అంటే సుమారు 500 మిల్లీలీటర్ల అన్నంతోపాటు కేవలం ఒక చిన్న కటోరి (100 మిల్లీలీటర్లు) రాజ్మా, కొద్దిగా సలాడ్ ఉంటుంది. ఈ ప్లేట్‌లో ఎక్కువ భాగం పిండి పదార్థాలే ఉంటాయి. ఇవి త్వరగా జీర్ణమవడం వల్ల కొద్దిసేపటికే మళ్లీ ఆకలి వేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అదే భోజనాన్ని బరువు తగ్గడానికి అనుకూలంగా మార్చాలంటే అన్నం పరిమాణాన్ని ఒక కటోరి (100 మిల్లీలీటర్లకు) తగ్గించాలి. అదే సమయంలో ప్రోటీన్‌ను పెంచేందుకు ఒక పెద్ద బౌల్ (200 మిల్లీలీటర్లు) మందమైన రాజ్మాను తీసుకోవాలి. దీనికి తోడు ఒక కటోరి పెరుగు, ఒక కటోరి సొరకాయ కూర, పెద్ద మొత్తంలో కచుంబర్ సలాడ్‌ను ప్లేట్‌లో చేర్చాలి.

ప్లేట్‌లో ఆహారాలను ఇలా నింపాలి..

ఇలా ప్లేట్‌లోని ఆహార నిష్పత్తులను మార్చడం వల్ల అన్నం పూర్తిగా మానేయాల్సిన అవసరం లేకుండానే భోజనంలో కూరగాయలు, పీచు పదార్థాలు, ప్రోటీన్ పరిమాణాన్ని పెంచుకోవచ్చు. అదే సమయంలో మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంతోపాటు, తక్కువ ఆహారంతో కాకుండా ఎక్కువ పరిమాణంలో సంతృప్తికరమైన ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. చాలామంది బరువు తగ్గలేకపోవడానికి ఇంట్లో తయారుచేసే భారతీయ వంటకాలనే కారణంగా భావిస్తుంటారు. కానీ సమస్య ఇంటి భోజనంలో కంటే, ప్లేట్‌ను ఏ విధంగా నింపుతున్నామన్నదానిలో ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

కాబట్టి ఇష్టమైన ఆహారాన్ని పూర్తిగా వదిలేయడం కంటే, అన్నం వంటి కార్బోహైడ్రేట్ల పరిమాణాన్ని నియంత్రించి, ప్రోటీన్, కూరగాయలు, సలాడ్, పెరుగు వంటి వాటికి ఎక్కువ స్థానం ఇవ్వడం ద్వారా భోజనాన్ని సమతుల్యంగా మార్చుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.




# 'రంభ ఊర్వశి మేనక'

# కలెక్షన్స్ జోరు

ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ 'రంభ ఊర్వశి మేనక'పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది.

మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి. కథ పరంగా కన్ఫ్యూజన్ ఏమి లేదు, రన్‌టైమ్ తక్కువగా ఉండటం, నరేష్ తన మార్క్ కామెడీతో నెట్టుకురావడం సినిమాకు కలిసొచ్చింది. దర్శకుడు చంద్రమోహన్ నరేష్ కు తగ్గ ఫన్ ను క్రియేట్ చేశాడు,



# ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?

లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. -అరుంధతి-, -భాగమతి-, -బాహుబలి- వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం -కథనార్: ది విల్డ్ సోర్సరర్-లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు.

# థియేటర్లను షేక్ చేసిన సినిమా..



హిందీ చిత్రపరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించిన సినిమా ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించిన దిల్ చాహతా హై. ఈ కల్ట్ క్లాసికల్ సినిమా విడుదలై 25 సంవత్సరాలు పూర్తైనప్పటికీ ఈ మూవీ పట్ల సినీ ప్రియుల క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఇందులో ఆమిర్ ఖాన్, సైఫ్ అలీ ఖాన్, అక్షయ్ ఖన్నా, ప్రీతి జింటా, సోనాలి కులకర్ణి , డింపుల్ కపాడియా ముఖ్య పాత్రలు పోషించారు. స్నేహం , ప్రేమ గురించి కొత్త పాఠాలను నేర్పుతూ, యువతరానికి ఎప్పటికీ ఇష్టమైన చిత్రంగా కొనసాగుతోంది. పావు శతాబ్దం క్రితం విడుదలైన కల్ట్ క్లాసిక్ 'దిల్ చాహతా హై' కథ, పాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నప్పటికీ, అక్షయ్ ఖన్నా సరసన కథానాయికగా నటించడానికి డింపుల్ కపాడియా మొదట్లో సంకోచించారు. ఆమె గతంలో అక్షయ్ ఖన్నా తండ్రి వినోద్ ఖన్నా సరసన కథానాయికగా నటించినందున, తనకంటే 18 ఏళ్లు చిన్నవాడైన నటుడితో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడం సముచితమూ కాదన్నా సందేహమే ఈ సంకోచానికి కారణం. స్క్రిప్ట్ చదవగానే 'దిల్ చాహతా హై'లోని పాత్రను తాను తిరస్కరించినట్లు డింపుల్ కపాడియా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. తనకంటే 18 ఏళు చిన్నవాడైన కథానాయకుడితో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించడానికి ఆమె మొదట్లో సంకోచించారు. తెరపై ఇంత వయసు వ్యత్యాసంతో ఉన్న జంటను ప్రేక్షకులు ఎలా అంగీకరిస్తారోనన్న ఆందోళనే ఆమె అయిష్టతకు కారణమని వెల్లడించారు. ఈ క్లాసిక్ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలై 25 ఏళ్లు పూర్తి చేసుకుంది.తాను మొదట ఈ సినిమా ఆఫర్‌ను తిరస్కరించినట్లు నటి డింపుల్ కపాడియా వెల్లడించారు. తనకంటే చాలా చిన్నవాడైన హీరోతో ప్రేమలో పడే తార పాత్రను పోషించడానికి ఆమె మొదట సంకోచించారు. అయితే, కథలోని పటిష్టత, పాత్ర చిత్రణలోని లోతు చివరికి ఆమెను ఈ చిత్రంలో భాగం కావడానికి ఒప్పించాయని తెలిపింది. నగర జీవితాన్ని ఆవిష్కరించింది. ఈ చిత్రం, సినీ ప్రేమికులలో ఒక పెద్ద సంచలనాన్ని సృష్టించింది.

# సముద్రం నేపథ్యంలో హై-వోల్టేజ్ యాక్షన్..




కోలీవుడ్ నటుడు సూరి హీరోగా, టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ విలన్ పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'మండాడి'సముద్రం నేపథ్యంలో రాబోతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాను 'సెల్ఫీ' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మతిమారన్ పుగళేంది ఈ చిత్రానికి కథ అందించి దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. తమిళనాడులోని తీర ప్రాంతాలకు చెందిన సాంప్రదాయ బోట్ రేస్ (ఋఱశ్రీఎశీఫ్ =ఋఎఱఅస్త్ర) పోటీల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. సముద్రం నేపథ్యంలో సాగే హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఇది రూపొందుతోంది. ఇందులో సూరి సరసన మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తుండగా, తెలుగు నటుడు సుహాస్‌తో పాటు ప్రముఖ నటుడు సత్యరాజ్, రవీంద్ర విజయ్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడుదల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకాశం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు




దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది.

ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.